క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లా పులే–అంబేడ్కర్ జాతర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ప్రస్తుత అధ్యక్షుడు నర్సిములు అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షులుగా గువ్వల లక్ష్మణ్, మొగులయ్య, జంగయ్య, బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా రఘునాథ్, సంయుక్త కార్యదర్శులుగా భీమ్రాజ్, రామస్వామి, కోశాధికారిగా శ్యామ్‌సుందర్‌లు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఆశన్న, మాసన్న, వెంకటయ్య, ఉడిత్యాల వెంకటయ్య, బాలకృష్ణయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక నిర్వహణ అధ్యక్షుడు మామిడి సామెల్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘన సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన జీకే మాస్టర్ షోటోకాన్ బ్లాక్‌బెల్టు కరాటే విద్యార్థి అఖిలేశ్వర్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.క్రిష్ణయ్య, చైర్మన్ రవికుమార్, మాస్టర్ శివకుమార్, అలీమోద్దీన్, పవన్, కల్యాణ్, రిష్విత్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

గండీడ్: వెన్నాచేడ్‌లో ఈనెల 19 నుంచి వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, పూజారి పవన్, సత్యనారాయణచారి తెలిపారు. ఆళ్లగడ్డ నుంచి తీసుకువచ్చిన కొత్త విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. 21 వరకు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పార్కు అభివృద్ధికి కృషి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఆరో వార్డు పరిధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు ఉన్న రోడ్డుతో పాటు పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఈ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణయ్య, నగేష్, శేఖర్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా కాంగ్రెస్



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండి మల్లేష్ అన్నారు. అసెంబ్లీలో బీసీ కులగణనపై తీర్మానం ప్రవేశపెట్టినందుకు శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీసీలందరూ ఏకమై పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు హరినాథ్, కిరణ్‌కుమార్, శోభారాణి, అంజియాదవ్, శ్రీను, శేఖర్, రమేష్, శేఖర్, బాలు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డాకులలో..



హన్వాడలో..



జిల్లాకేంద్రం తెలంగాణచౌరస్తాలో నిరసన

కదంతొక్కిన కార్మికులు



దేవరకద్రలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సాక్షినెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం పెత్తందారులకు కొమ్ముగాస్తుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ ఆరోపించారు. శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేవరకద్రలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు కొండారెడ్డి, రాము, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల మండల కేంద్రంలో శుక్రవారం కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో భారత్ బంద్‌ను నిర్వహించారు. బాలరాజు, నరేందర్, ఆనంద్, మోహన్, ప్రసాద్, బాబు, శ్యాం ఉన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని టీఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి యాదగిరి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు దేవదానం డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నచింతకుంటలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాబు, నరసింహ, భిక్షపతి, నాగరాజు, దయాకర్, కోళ్ల వెంకటన్న, కొండన్న, చంద్రన్న, వెంకటేష్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ లో దేశవ్యాప్త సమ్మెకు టీఎఫ్‌టీయూ మద్దతు పలికింది. ఇందులో భాగంగా శుక్రవారం ఆ సంఘం నాయకులు తెలంగాణ చౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా మీదుగా ర్యాలీ తీసి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ఖలీల్, జిల్లా అధ్యక్షుడు పి.విజయకుమార్ మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. బహుళజాతి కంపెనీలకు మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని, ఎనిమిది గంటల పని దినాన్ని, కనీస వేతనాల, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ చట్టాలను నిర్వీర్యం చేసిందని వారు విమర్శించారు. ఈ ఆందోళనలో ఆయా కార్మి సంఘాల నాయకులు చంద్రాయుడు, బుచ్చారెడ్డి, జయమ్మ, నాగరాజు, మన్యం, బాలకృష్ణ, ఇంతియాజ్, ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్, అంగన్‌వాడీలు కమల, సుజాత, ఆండాలు, సునీత తదితరులు పాల్గొన్నారు.

హన్వాడలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, రాములు, శేఖర్, రేఖమయ్య, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో..



జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



చిన్నచింతకుంటలో..

హక్కుల సాధనే ధ్యేయంగా పోరాడాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ముందు ధర్నా నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యదర్శి చంద్రనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కోశాధికారి కృష్ణమోహన్, వెంకట్రాంరెడ్డి, యుగంధర్ నాయుడు, యాదయ్య, కృష్ణకాంత్, నాగరాజు, చంద్రశేఖర్, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: సీపీఎస్‌ను దానికి మూలమైన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలపింగ్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చట్టాన్ని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మణికొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. జీహెచ్ఎం రహమాన్, ఉపాధ్యాయులు సవిత, కల్యాణి, శ్రీరాములు, మధుసూదన్, మత్సంధర్, దీప్తి, జగదీష్, శ్రీనివాసులు, అరుణ, శివకుమారి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రానికి వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, కొత్తకోటకు 50 పడకల ఆస్పత్రి, చిన్నచింతకుంటకు జూనియర్ కళాశాలను వెంటనే మంజూర్ చేయాలని శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా ఒక ప్రొసిడింగ్ తీసుకువచ్చి వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. దానికి పూర్తిగా అనుమతి లేదన్నారు. వెంటనే మంజూరు చేయాలని కోరారు. 2009లో మాజీ సీఎం కేసీఆర్ చిన్నచింతకుంటకు జూనియర్ కళాశాల హామీ ఇచ్చి నేరవేర్చలేదని ఆరోపించారు.

అడ్డాకుల: మండలంలోని వర్నెకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త బాలస్వామి కొన్నాళ్ల క్రితం మరణించగా.. పార్టీ సభ్యత్వం ఉండటంతో ఆయన కుటుంబానికి రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. ఈ మేరకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. కాంగ్రెస్ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు బాబా ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. బాధితుడి వైద్య ఖర్చుల కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి శుక్రవారం రూ.10వేలను పంపగా వాటిని కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్యగౌడ్ బాధితుడికి అందజేశారు. ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యేకు జర్నలిస్టు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం



గండీడ్: మండలంలోని ఆయా గ్రామాల్లో సత్వర అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో కొత్తగా విధుల్లో చేరిన ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు శాలువా పులమాలలతో సన్మానించారు. పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, గోపాల్, లక్ష్మారెడ్డి, నరోత్తంరెడ్డి, ఆశిరెడ్డి, పులిందర్‌రెడ్డి, ఆంజనేయులు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



డీఆర్‌డీఓ నర్సిములును సన్మానిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ పరిధిలో నడిచే అద్దె వాహనాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు. ఇటీవల డీఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించిన నర్సిములును కలిసి విన్నవించారు. ఈ మేరకు ఆయనను సన్మానించారు. యూనియన్ నాయకులు నిరంజన్, తరుణ్, తిరుపతి, శ్రీశైలం నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రం వెంకటేశ్వరకాలనీ గెలాక్సీ ఉన్నత పాఠశాలలో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ వారికి విశేష పూజలు చేశారు. విద్యార్థులు ఆదిత్య హృదయ పఠనం చేశారు. యోగా గురువు పురుషోత్తం విద్యార్థులచే 12 రకాల సూర్యనమస్కారాలు చేయించారు. టీటీడీ జిల్లా సహాయకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి రథసప్తమి విశిష్టత వివరించారు. రథసప్తమి రోజు సూర్యుని ఆరాధిస్తే మహాపుణ్యాన్ని, ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.భానుప్రకాశ్, శ్రీవారి సేవకులు పాండురంగం, ఎత్తెపు కేశవులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాశాలలో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రథసప్తమి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు



బాలానగర్‌లో శుక్రవారం నిలిచిన వాహనాలు

బాలానగర్: మండల కేంద్రంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదు మంది మృతిచెందిన విషయం తెలిసిందే.. అయితే ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ, ఏఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ముఖ్య కూడలిలో రోడ్డు డివైడర్ సైజ్‌ను తగ్గించి కేవలం చిన్నపాటి వాహనాలు జాతీయ రహదారిని దాటేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా భారీవాహనాలు అటు అమీత్ కాటన్ మిల్ వద్ద.. ఇటు పెద్దాయపల్లి కూడలి వద్ద యూటర్న్ చేసుకునేలా చర్యలు చేపట్టారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పెద్ద ఎత్తున బారికేడ్లు సైతం ఏర్పాటు చేశారు. అదేవిధంగా శుక్రవారం మండల కేంద్రంలో జరిగే సంతను దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్య కూడలిలోనే భారీ వాహనాలు యూటర్న్ తీసుకుంటున్నాయి. చిన్నపాటి స్థలం ఉన్నచోటే ఇలా భారీ వాహనాలు యూటర్న్ తీసుకోవడం, పదుల సంఖ్యలో ప్రజలు, ద్విచక్రవాహనాలు రోడ్డు దాటుతుండడం, వారాంతపు సంత ఇలా అన్ని కలిసి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. శుక్రవారం సైతం కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మరోసారి ప్రమాదాలు చోటు చేసుకునేందుకు ఆస్కారం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని, ఫ్లైఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘనిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫీజుల పేరుతో విద్యార్థులను వేదిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అధనంగా వసూలు చేస్తున్న రుసుంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్, కురుమయ్య పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

మక్తల్: ప్రతి విద్యార్థి మొదట పరీక్షలంటే భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదారం మద్దునూరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో జాగ్రత్తలు తగు సూచనలు అందించారు. అనంతరం బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పదోతరగతిలో వందశాతం మార్కులు సాధిస్తే 10తులాల వెండిని బహుకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్ యాదవ్, గోపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కట్ట సురేష్, హన్మంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22వేల పోస్టులను భర్తీ చేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించి 22 వేల పోస్టుల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ పోరాట సమితిరాష్ట్ర అధ్యక్షుడు మెట్టయాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సదానందం, ఉమేష్‌కుమార్, మల్లేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాచాలలో వైభవంగా బోనాలు

కనుల పండువగా కల్యాణం



దేవరకద్రలో కల్యాణోత్సవం



రాచాలలో..



జిల్లాకేంద్రంలో పూజలు

అడ్డాకుల: మండల పరిధిలోని రాచాల గ్రామంలో వెలిసిన చెన్నకేశవస్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద శుక్రవారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం జరిపించారు. ఉత్సవాల నిర్వాహకులు ఉదయం గంగ సేకరణ చేపట్టారు. ఆలయానికి సమీపంలో ఉన్న దేవుని బావి వద్దకు వెళ్లిన పండితులు అక్కడ గంగపూజ నిర్వహించిన అనంతరం గంగను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌ను గంగతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గవిని చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మొల్గర రాము, బొక్క శ్రీనివాసులు, పిల్లి నరహరి, జగన్నాథం, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా సాయంత్రం వైభవంగా బొడ్రాయి వద్దకు బోనాల ఊరేగింపు చేపట్టారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ఒడి నింపారు. ఉత్సవాలలో చెన్నకేశవ స్వామికి పంచామృతాభిషేకం, అలంకారం కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయంలో అఖండ భజనలను ప్రారంభించారు. శనివారం తెల్లవారు జామున చెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాటు చేశారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలో గల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి ఆలయం 20వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. వార్షికోత్సవాలను పురస్కరించుకొని గత మూడు రోజుల నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం దీక్షా హోమం, అభిషేకం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.